క్లుప్తంగా

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం



గ్రామస్తులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ శ్రీధర్ రాజా

ఎల్.ఎన్.పేట: మండలంలోని దబ్బపాడు గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని జెడ్పీ సీఈఓ ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా అన్నారు. గ్రామస్తులతో గురువారం సమావేశమయ్యారు. తాగునీటి సమస్యపై సర్పంచ్ ముద్దాడ మోహిని, మాజీ సర్పంచ్ జమ్మి మోహనరావుతోపాటు గ్రామస్తులు గత కొన్ని రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. సమస్యను గుర్తించిన అధికారులు శాశ్వత పరిష్కారం చేపట్టేందుకు సిద్ధమయ్యారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో ఉన్న మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి గ్రామానికి వేసిన పైపులైన్ ద్వారా నీటి సరఫరా అవ్వటం లేదని గ్రామస్తులు వివరించారు. సమస్యను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని సీఈఓ భరోసా ఇచ్చారు. అక్కడే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులకు తగిన సూచనలు చేశారు.

బాధ్యతల స్వీకరణ



వైద్యురాలు షాలిని

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం పీహెచ్‌సీకి రెండో వైద్యురాలిగా ఎం.షాలిని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ రెండో వైద్యుడిగా ఉన్న అరవింద్ పీజీ చదువు నిమిత్తం సెలవులపై వెళ్లారు. నెల రోజులుగా ఒక్క వైద్యురాలే పనిచేస్తుండగా వైద్యశాఖ అధికారులను షాలినిని నియమించారు.

పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న నిమ్మక అప్పన్న

కొత్తూరు: ఈ నెల 12వ తేదీన మండలంలోని దిగువమల్లిగూడకు చెందిన అవివాహిత సవర చిన్నారమ్మ పిడుగు పాటుకు మృతి చెందింది. ఆ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న కోరారు. మృతురాలి తల్లిదండ్రులను గురువారం పరామర్శించారు. మేకలు కాపలాకి వెళ్లి పిడుగుపాటుకు గురై మృతి చెందిందన్నారు. జిల్లా కలెక్టర్, సీతంపేట ఐటీడీఏ పీఓ స్పందించి చిన్నారమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

అప్రమత్తం..



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

హిరమండలం: విపత్తుల సమయంలో విద్యార్థులు అప్రమత్తంగా వ్యవహరించాలని అగ్నిమాపక శాఖ అధికారి బుచ్చోడు అన్నారు. గురువారం స్థానిక ప్రైవేట్ డిగ్రీ కాలేజీలో అగ్నిప్రమాదాలు, విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాలు జరిగిన సమయంలో క్షతగాత్రులను ఎలా తీసుకురావాలి? వారికి ప్రథమ చికిత్స ఎలా చేయాలి? మంటలను ఎలా అదుపు చేయాలి? అనే అంశాలపై అవగాహన కల్పించారు. అగ్నిమాపక, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

కొత్తూరు: ఈ నెల 16వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ నీరజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

20న హిరమండలంలో ..

హిరమండలం: ఈ నెల 20వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ గురువారం తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు.

20న పాఠశాలల ఆడిట్

హిరమండలం: ఈ నెల 20వ తేదీన ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఆడిట్‌ను స్థానిక ఎమ్మార్సీలో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ రాంబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ ఆడిట్ జరుగుతుందన్నారు. హెచ్ఎంలు అప్‌డేట్ చేసిన క్యాష్ బుక్స్, బిల్లులు, ఓచర్లు, పీఎంసీ తీర్మాన రిజిస్ట్రేషన్లు, అప్‌డేట్ చేసిన బ్యాంక్ బుక్స్ తీసుకురావాలన్నారు. ఇప్పటికే ఓసారి ఇంటర్నల్ ఆడిట్ జరిగిందన్నారు. ఈ సారి అన్ని వివరాలతో కూడిన ఆడిట్ ఉంటుందన్నారు. ప్రతి ఒక్క పాఠశాల నుంచి విధిగా హాజరుకావాలన్నారు.

ఉపాధి హామీ పనుల్లో.. సామగ్రి కొరత



కోదడ్డపనలో ఒకే గునపంతో పనిచేస్తున్న వేతనదారులు

- వేతనదారులే సామాన్లు తెచ్చుకోవాలి
- లక్ష్యాలు చేరుకోక అవస్థలు
- గిట్టుబాటుకాని వేతనం

సారవకోట: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లోని చెరువులు, కాలువల్లో పూడికతీత, మట్టి పనులను వేతనదారులతో చేయిస్తున్నారు. ఈ పనులు నిర్వహించేందుకు వేతనదారులకు గునపం, పార, గడ్డపార, ఇతర పరికరాలు అందించాల్సిన బాధ్యత సంబంధిత శాఖకు ఉంది. ప్రస్తుతం నరసన్నపేట నియోజకవర్గంలో 33,544 మంది వేతనదారులు పనులు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయా గ్రామాల్లో ఉన్న శ్రమ శక్తి సంఘాలకు సామగ్రి అందించారు. అప్పటినుంచి నేటి వరకు సామగ్రి అందించిన దాఖలాలు లేవు. వేతనదారులు తమ వద్ద ఉన్న ఈ సామగ్రితోనే పనులు చేస్తున్నారు. ఈ సామగ్రి వేతనదారులందరి దగ్గర ఉండకపోవడం, కొంతమంది దగ్గర మాత్రమే ఉండటంతో వారు తీసుకొచ్చిన సామగ్రితో పనులు చేస్తున్నారు. ఒక శ్రమ శక్తి సంఘంలో పది మంది బృందంగా పనిలో పాల్గొంటే కనీసం మట్టిని తవ్వడానికి చెరో రెండు గునపాలు, పారలు, ఆరు తట్టలు అవసరం. ఒకే గునపంతో అందరూ పనిచేయడంతో నిర్దేశించిన లక్ష్యాన్ని వేతనదారులు చేరుకోలేకపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన రోజుకు గరిష్ఠం వేతనం రూ.307 పొందలేకపోతున్నారు. గతంలో వంద రోజులు పని పూర్తి చేసుకున్న కుటుంబాలకు ఒక గునపం ఉచితంగా అందించారు. అప్పట్లో అందజేసిన పనిముట్లలో 30 శాతం మాత్రమే వాడుకలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు కూడా గతంలో ఇచ్చినట్లు మరలా శ్రమ శక్తి సంఘాలకు సామగ్రి చేస్తే నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేందుకు అవకాశం ఉంటుందని వేతనదారులు అభిప్రాయపడుతున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో చేపడుతున్న ఉపాధి పనులు, వేతనదారుల వివరాలు..

మండలం	పంచాయతీలు	జరుగుతున్న పనులు	వేతనదారులు
సారవకోట	35	148	7,292
జలుమూరు	40	103	8,645
నరసన్నపేట	34	125	7,601
పోలాకి	31	104	10,006

సామగ్రి అందించాలి



ఉపాధి పనులకు వెళ్తున్న వేతనదారులకు పనులు చేసేందుకు అవసరమైన సామగ్రిని ప్రభుత్వం అందించాలి. వేతనదారులకు అవసరమైన సామగ్రి లేకపోవడంతో పనులు సరిగా చేయలేక పోతున్నారు.

– సారవకోట అప్పారావు, సామాజిక కార్యకర్త, సారవకోట మండలం

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



ఉపాధి పనులు చేసే వేతనదారులకు సామగ్రిని అందించేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం. ప్రస్తుతం వేతనదారులు తీసుకొస్తున్న సామగ్రితో నిర్దేశించిన లక్ష్యాలు చేరుకునేందుకు అవగాహన కల్పిస్తున్నాం.

– నారాయణరావు, ఏపీఓ, సారవకోట

విచారణ మళ్లీ వాయిదా



విచారణకు హాజరైన ప్రజలు

సరుబుజ్జిలి: మండలంలోని తెలికిపెంట పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై గురువారం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశం(విచారణ) మరలా వాయిదా పడింది. ఈ పంచాయతీలో సుమారు రూ.2.70 లక్షల నిధులు దుర్వినియోగం జరిగినట్లు పంచాయతీ పరిధి పాతపాడు గ్రామానికి చెందిన బెవర మల్లేశ్వరరావు ఈ ఏడాది ఏప్రిల్ 28న కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఈ నెల 3వ తేదీన డీఎల్‌పీఓ విచారణ చేపట్టిన సమయంలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో విచారణ జరగకుండా అధికారులు వెనుదిరిగారు. మరలా ఈ నెల 5వ తేదీన గ్రీవెన్స్‌కు రెండోసారి చేసిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. రెండోసారి కూడా నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఎటువంటి విచారణ జరగలేదు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన అంశాల మేరకు మాత్రమే విచారణ చేపట్టామని ఈఓపీఆర్డీ బొడ్డేపల్లి రామారావు తెలిపారు. కేవలం ఫిర్యాదుదారు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. సర్పంచ్ సమావేశానికి హాజరుకాలేదు. దీంతో విచారణ వాయిదా వేశారు. ఎస్‌ఐ బి.హైమావతి విచారణ సమయంలో ఎటువంటి గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ విచారణలో పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



పాతపట్నం: సరిహద్దులో వాహనాలను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన పాతపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఒడిశా నుంచి వచ్చిన వాహనాలను పాతపట్నం సీఐ వి.రామారావు ఆధ్వర్యంలో పరిశీలించారు. తనిఖీల్లో ఎస్‌ఐ బి.లావణ్య, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.


కొత్తూరులో..



కొత్తూరు: వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ ప్రసాదరావు, ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ

కొత్తూరు: మండల కేంద్రంలోని శ్రీకాకుళం రోడ్డులో స్థానిక సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్‌ఐ ఎండీ అమీర్ అలీ గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. గతంలో వాహనాలకు విధించిన జరిమానాలను వసూలు చేశారు. రహదారి నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమానా విధించారు. హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇతర ప్రాంతాలు నుంచి వచ్చిన అపరిచిత వ్యక్తుల నుంచి వివరాలు సేకరించి నమోదు చేశారు.

మండుటెండలో నిరీక్షణ..



ఆమదాలవలస పట్టణంలో కొత్తూరు–హిరమండలం, బత్తిలి, సరుబుజ్జిలి తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సులను స్థానిక రామ మందిరం సమీపంలో నిలుపుదల చేస్తారు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణీకులు ఈ స్టాప్ వద్ద వేచి ఉంటారు. ఈ ప్రాంతంలో ఆర్టీసీకి సంబంధించి షెడ్డు గతంలో ఏర్పాటు చేశారు. ఈ షెల్టర్‌ను కొంతమంది టీడీపీ కార్యకర్తలు కూల్చి వేశారు. అప్పటినుంచి ప్రయాణీకులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు. ఇక్కడ షెల్టర్‌ను ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు. **- ఆమదాలవలస**

చెట్టు నీడే రక్ష..



ఉపాధి వేతనదారులకు చెట్టు నీడే రక్షణగా ఉంది. ఎండ తీవ్రతకు చెట్ల కిందే సేద తీరుతున్నారు. ఉపాధి పనిచేసే చోట టెంట్లు వేయాలి. కనీసం కొబ్బరి కొమ్మల పందిరైనా వేయాలి. గతంలో ప్రభుత్వంలో ఇచ్చిన టెంట్లు ఉన్నా వాటిని కూడా వినియోగించడం లేదు. దీంతో వేతనదారులు అవస్థలు పడుతున్నారు. నరసన్నపేట మండలంలోని ఉర్లాం వద్ద గురువారం పని పూర్తయిన తరువాత వేతనదారులు సమీపంలోని చెట్ల కింద సేద తీరుతూ ఇలా కనిపించారు. **- నరసన్నపేట**

లీకేజీలకు మోక్షమెప్పుడు?



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని లక్ష్మీనర్సుపేట రోడ్డులో లీకేజీ పనుల కోసం తవ్విన గొయ్యి. మండలంలోని సుమారు 26 గ్రామాలకు తాగునీరు అందించేందుకు మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి పైపులైన్లు ఏర్పాటు చేశారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో వంశధార నదీ తీరంలో నిర్మించిన మెగా రక్షిత తాగునీటి పథకం నుంచి మండల కేంద్రం వరకు భూ గర్భంలో ఏర్పాటు చేసిన పైపులు నిత్యం లీకేజీ అవుతున్నాయి. గ్రామాలకు తాగునీరు సక్రమంగా అందటం లేదు. ఎక్కడైనా ఒకసారి లీకేజీ జరిగితే వారం, పది రోజుల పాటు అలాగే వదిలేస్తున్నారని, లీకేజీలు లేకుండా శాశ్వత పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- ఎల్.ఎన్.పేట**

రాకపోకలకు అవస్థలు..



పొందూరు మండలంలోని బొడ్డేపల్లి రైల్వే అండర్ పాసేజ్‌లో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. బుధవారం కురిసిన భారీ వర్షానికి అండర్ పాసేజ్‌లో భారీగా నీరు చేరడంతో ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మోటార్లు పెట్టి నీటిని బయటకు పంపేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు కోరుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. **- పొందూరు**

పాతపట్నంలో ప్రేమ ప్రవాహిని రథం



పాతపట్నం: రథోత్సవంలో పాల్గొన్న సేవా సమితి సభ్యులు

పాతపట్నం: భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా ప్రేమ ప్రవాహిని రథం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రయాణిస్తుందని సాయి సంస్థ జిల్లా మాజీ అధ్యక్షుడు లింగరాజు తెలిపారు. రథం గురువారం ఉదయం పాతపట్నం మండల కేంద్రానికి చేరుకుందన్నారు. పాతపట్నంలో రథాన్ని సమితి కన్వీనర్ నాగులపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. సేవా సమితి సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

మాళువలో..

సారవకోట: మండలంలోని మాళువలో గురువారం సత్యసాయి బాబా రథయాత్ర నిర్వహించినట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పి.మురళీ తెలిపారు. నౌతళ నుంచి రథ యాత్రను బైక్ ర్యాలీ చేపట్టారు. అనంతరం గ్రామంలో బాల వికాశ్ పిల్లలతో కోలాటం నిర్వహించారు 100 మంది మహిళలు కలశాలతో నామ సంకీర్తనలు చేసుకుంటూ రథయాత్ర చేపట్టారు. సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా తిరువీధి



గజవాహనంపై స్వామివారి ఊరేగింపు

నరసన్నపేట: స్థానిక వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. 9 రోజులుగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న విషయం విదితమే. గురువారం వేంకటేశ్వరస్వామి గజవాహనంపై ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు సాయి కృష్ణమాచార్యులతోపాటు సత్యవరాగ్రహారం గ్రామానికి చెందిన పండితులు మావుడూరి జగదీష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

సత్కారం..



రైతులను సత్కరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మెళియాపుట్టి: ఖరీఫ్‌లో నవధాన్యాల సాగు ఎంతో ఉపయోగకరమని ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలు నాగరాజు, కాంతమ్మ, ధర్మరాజు అన్నారు. గురువారం పట్టుపురంలో రైతులకు అవగాహన కల్పించారు. నవధాన్యాల సాగు వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయానికి మారాలన్నారు. అనంతరం పలువురు రైతులను సత్కరించారు. అధికారులు పాల్గొన్నారు.

ఏపీఆర్డీసీలో విద్యార్థుల సత్తా..

కొత్తూరు: ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఏపీఆర్డీసీ ఫలితాల్లో కొత్తూరు ప్రభుత్వ జూనియర్ కాలేజ్ విద్యార్థులు సత్తా చాటారు. ఫలితాల్లో సీఈసీ గ్రూప్‌కు చెందిన ఉమ్మడిశెట్టి చంటి 48వ ర్యాంకు, శ్రీనివాస జన్నె 52వ ర్యాంకు, ఓఏఎస్ ఒకేషనల్ గ్రూప్‌కు చెందిన కోరూడు శ్రీహరి 90వ ర్యాంకును సాధించారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ జి.ధనుంజయరావు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

పాడైన ఎలక్ట్రికల్ వస్తువులు

మెళియాపుట్టి: గంగరాజపురంలో పిడుగు పడి పలు ఇళ్లల్లోని విద్యుత్ మీటర్లు, టీవీలు పాడయ్యాయి. బుధవారం రాత్రి గాలులు, పిడుగులతో వర్షం కురిసింది. సుధాకర్ డొల్లై, జయసేన్ డొల్లై ఇళ్లపై పిడుగులు పడటంతో స్లాబ్‌లకు పగుళ్లు ఏర్పడ్డాయి.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నరసన్నపేట: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులందరూ ప్రకృతి వ్యవసాయం చేయాలని ఏపీసీఎన్ఎఫ్ యనిట్ ఇన్‌చార్జి బి.సీతారామయ్య అన్నారు. మండలంలోని మడపాంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. దీంట్లో సర్పంచ్ ఎరుకవాడు, ఎంపీటీసీ వాసుదేవరావు, రైతులు పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను సత్కరించారు.

మలేరియా నియంత్రణకు చర్యలు

హిరమండలం: వసతిగృహాలు, హాస్టళ్లలో పారిశుద్ధ్య పనులకు పెద్దపీట వేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి బీఎన్ ఆచారి అన్నారు. మలేరియా నియంత్రణలో భాగంగా కల్లట కార్మెల్ హాస్టల్‌లో మలాథియన్ స్ప్రే చేయించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈఓపీఆర్డీ గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటితో అవస్థలు



రోడ్డుపై నిల్వ ఉన్న వర్షం నీరు

జలుమూరు: మండలంలోని రామయ్యవలస ప్రధాన రోడ్డుపై వర్షం నీరు నిల్వ కావడంతో ఆ గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో ఇటు కోమర్తి నుంచి అటు జలుమూరు వరకు సుమారు 20 గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణాలు చేస్తుంటారు. అధికారులు స్పందించి వరద నీటిని తొలగించాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పరామర్శ..



రాజేశ్వరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ధర్మాన కృష్ణదాస్, తదితరులు

నరసన్నపేట: మండలంలోని చింతువానిపేటకు చెందిన సురంగి రాజేశ్వరి ఇటీవల రాజేశ్వరి అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ గురువారం పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు చింతు రామారావు, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, నడిమింటి శాంతారావు ఉన్నారు.

రేపటి నుంచి రైల్వే గేట్ మూసివేత

నరసన్నపేట: మండలంలోని కొల్లవానిపేట వద్ద ఉన్న రైల్వే గేట్‌ను ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు మూత వేస్తున్నట్లు శ్రీకాకుళం రోడ్ రైల్వే సీనియర్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. గేటు వద్ద ట్రాక్ మరమ్మతు పనులు చేపడతామన్నారు. 17, 18వ తేదీల్లో ఉదయం 6 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు, 19, 20వ తేదీల్లో పూర్తిగా గేటును మూసివేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాంత వాసులు సహకరించాలన్నారు.

ఈ ఏడాది.. సాగునీరు ప్రశ్నార్థకమే!



రాణ వద్ద పాడైన షట్టర్లు



పెద్దదూగాం వద్ద షట్టర్ల దుస్థితి ఇలా..

- ముంచుకొస్తున్న ఖరీఫ్
- మరమ్మతులకు నోచుకోని కాలువలు
- ప్రతి ఏటా అవస్థలు పడుతున్న రైతులు

జలుమూరు: ఖరీఫ్ సీజన్ ముంచుకొస్తున్నా.. వంశధార కాలువలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. జలుమూరు మండలం పరిధిలో మెట్టు, పల్లం కలిపి సుమారు 29 వేల ఎకరాల వరకు వంశధార కాలువలపై ఆధారపడి సాగు చేస్తున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలో సుమారు 82 వేల ఎకరాలకు వంశధార కాలువల ద్వారా సాగు నీరందించాల్సి ఉంది. వంశధార ప్రధాన ఎడమ కాలువ, ఓపెన్ హెడ్ కాలువలైన నగిరికటగాం, జలుమూరు, మబగాం, లుకులాం, పోలాకి, 3–ఆర్ నడగాం, 14–ఆర్ మర్రివలస, 15–ఆర్ బద్రి, 16–ఆర్ గుమ్మపాడు, 17–ఆర్ కిన్నెరవాడ, 18–ఆర్ బొడ్డపాడు, 19–ఆర్ పర్లాం, 20–ఆర్ కూర్మనాథపురంతోపాటు అనుబంధ పిల్ల కాలువలు సుమారు 50 వరకు ఉన్నాయి. ఈ ఏడాది ఇంతవరకు మరమ్మతు పనులు ప్రారంభించలేదు.

పనిచేయని షట్టర్లు..

హిరమండలం డివిజన్‌కు సంబంధించి 19–ఆర్ పర్లాం, నగిరికటకం, ఓపెన్ హెడ్, మబగాం, తదితర కాలువలు చాలా అధ్వానంగా ఉన్నాయి. నరసన్నపేట బ్రాంచ్ ద్వారా ఈ కాలువకు సాగు నీరందించాల్సిన వంశధార ప్రధాన ఎడమ కాలువ షట్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. పెద్దదూగాం–రాణా గ్రామాల మధ్య కాలువపై ఉన్న షట్టర్ల తలుపులు పనిచేయడం లేదు. ఖరీఫ్ నాటికి వర్షం పడి కాలువలో నీటి ప్రవాహం ఎక్కువైతే ఈ తలుపులు రాక.. నీరు కింద పొలాలకు వెళ్లని దుస్థితి. చిన్నదూగాం వద్ద కూడా కాలువపై ఉన్న షట్టర్లు పూర్తిగా కాలువలోనే ఉండిపోయాయి. మిగిలిన కాలువల్లో కూడా ఎటువంటి మరమ్మతులు చేపట్టక పూడికలతో నిండిపోయాయి. ఫైలీస్, హుడ్ హుడ్, తిత్లీ తుఫాన్లకు పడిన గండ్లు ఇప్పటివరకు చాలాచోట్ల పూడ్చలేదు. అధికారులు స్పందించి కాలువల మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ప్రతీ ఏడాది ఇదే పరిస్థితి..

ప్రతీ ఏడాది ఇదే తంతుగా మారుతోంది. ఖరీఫ్ కాలం ప్రారంభం అవుతుందన్న తరుణంలో పనులు ప్రారంభిస్తారు. వ్యవసాయ పనులు ఒక వైపు జరుగుతుండగా.. మరోవైపు కాలువ పనులు పైపైన చేపడతారు. ఈ ఏడాదైనా సాగునీరు సకాలంలో అందించాలి.

– బగ్గు లక్ష్మణరావు, రైతు, మర్రివలస, జలుమూరు మండలం

పనులు పూర్తి చేస్తాం

నరసన్నపేట సబ్ డివిజన్‌కు సంబంధించి ఈ ఏడాది రైతులకు సాగునీరు సకాలంలో అందిస్తాం. కాలువల పనులకు అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– ప్రభాకర శర్మ, డీఈఈ, నరసన్నపేట సబ్ డివిజన్